


దీపావళి పర్యావరణ హితంగా జరుపుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

దీప కాంతులతో శోభాయమానంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండగ దీపావళిని జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి శుభాకాంక్షలు తెలిపారు. మన దేశంలో చేసుకునే ప్రతి పండుగకూ ఒక పరమార్థం ఉందని, మనకు జీవన శైలిని నేర్పుతుందని పేర్కొన్నారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటామని తెలిపారు. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల ఊసే లేదు..!

- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులైజేషన్‌పై నోరు మెదపని సర్కార్
- రాష్ట్రవ్యాప్తంగా పది వేల మంది జాబితా సిద్ధం చేసిన వైసిపి ప్రభుత్వం
- మూడు వేల మంది క్రమబద్ధీకరణ.. ఎన్నికల కోడ్‌తో ఏడు వేల మందికి బ్రేక్
- ఉమ్మడి పశ్చిమలో దాదాపు 800 మంది ఉద్యోగుల ఎదురుచూపులు
- డిగ్రీ, ఇంటర్ కాలేజీ అధ్యాపకులే అత్యధికం
- సిఎంతో సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడకపోవడంపై విమర్శలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన 114 జిఒను పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఉద్యోగుల సమస్యలపై సిఎంతో శనివారం జరిగిన చర్చల్లో ఉద్యోగ సంఘాల నేతలు సైతం మధ్యలో నిలిచిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి మాట్లాడకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ సంఘాల భవనాల ఆస్తి పన్ను బకాయిల గురించి మాట్లాడిన ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగుల సమస్యలను మాత్రం గాలికొదిలేశారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలంటూ ఎప్పటి నుంచో సంబంధిత ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంటూ 2019 ఎన్నికల్లో వైసిపి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దీంతో ప్రభుత్వ పదవీకాలం చివర్లో 2023 అక్టోబర్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి జిఒ 114ను జారీ చేసింది. 2014కు ముందు చేరిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు అందులో పేర్కొంది. అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10,200 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు శాఖలవారీగా ప్రకటించింది. రెగ్యులరైజేషన్ జాబితాలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 800 మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వీరిలో జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులు 200 మంది వరకూ ఉండగా, డిగ్రీ అధ్యాపకులు 70 మంది ఉన్నారు. ఇతర శాఖల్లో మిగిలిన ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం అడిగిన అన్ని పత్రాలనూ సేకరించి కాంట్రాక్ట్ ఉద్యోగులు అందించారు. దీనికోసం నానాతంటాలు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖలో మూడు వేల మందిని రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం తొలివిడత ఉత్తర్వులు ఇచ్చింది. మరో ఏడు వేల మందికి సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వడంలో తాత్సారం చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా మధ్యలో నిలిచిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ గురించి పట్టించుకోని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరుతూనే ఉన్నారు.

ప్రభుత్వం వద్ద నోరు విప్పని ఉద్యోగ సంఘాల నేతలు

ఉద్యోగుల సమస్యలకు సంబంధించి శనివారం ఉద్యోగసంఘాల నేతలతో మంత్రుల కమిటీ, సిఎంతో చర్చలు సాగాయి. నాలుగు పెండింగ్ డిఎలకుగాను ఒక్క డిఎ మాత్రమే ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఉద్యోగ సంఘ భవనాలకు ఆస్తిపన్ను సైతం రద్దు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి మాత్రం ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడ లేదనే విమర్శలు ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అప్పట్లో పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్న కెఎస్.లక్ష్మణరావు మధ్యలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేసే అంశంపై శాసనమండలిలో ప్రశ్నించారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం ఇస్తూ సంబంధిత జిఒపై కొన్ని అనుమానాలు ఉన్నాయని, అడ్వకేట్ జనరల్‌కు పంపించామని, అక్కడి నుంచి వచ్చిన తర్వాత రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియపై నోరు మెదపకపోవడం సంబంధిత ఉద్యోగులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వర్షం.. రహదారులు జలమయం



మొగల్తూరులోని పోలీస్ స్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆదివారం తెల్లవారుజామున సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షానికి డ్రెయిన్లలో నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. అయితే మధ్యాహ్నం నుంచి వాతావరణం పొడిగా మారడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మొగల్తూరు: శనివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా మండలంలో వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. మొగల్తూరు నుండి పడమటిపాలెం, కొత్తపాలెం మీదుగా వెంప వెళ్లే రహదారిపై గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు నుండి శేరేపాలెం మీదుగా కొప్పర్రు వెళ్లే రహదారి కూడా ధ్వంసమైంది. కాళీపట్నం నుండి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లే రహదారి పలుచోట్ల గుంతలపడి నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేసైనా ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో ఆక్వా రైతులు విలవిల



ఆక్వా చెరువులో తిరుగుతున్న ఏరియేటర్

ప్రజాశక్తి - మొగల్తూరు

వాతావరణ మార్పుల ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, ముత్యాలపల్లి, కాళీపట్నం, పాతపాడు తదితర గ్రామాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండడంతో చేపలు, రొయ్యలు తేలిపోతున్నాయి. దీంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. నీటిలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు 24 గంటలూ ఏరియేటర్లను తిప్పుతున్నారు. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడటంతో ఆయిల్ ఇంజిన్లు, జనరేటర్లతో ఏరియేటర్లను తిప్పాల్సి వస్తోంది. దీంతో ఎకరం చెరువుకి రోజుకు రూ.మూడు వేల నుంచి రూ.4 వేల వకరూ అదనంగా ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల బారిన రొయ్యలు, చేపలు

వర్షాల ప్రభావంతో ఆక్వా చెరువుల్లోని చేపలు, రొయ్యలు తెగుళ్లబారిన పడుతున్నాయి. రొయ్యలకు విబ్రియో వైట్‌స్పాట్ వంటి వైరస్‌లు సోకి మృత్యువాత పడుతున్నాయి. దీంతో రొయ్యలు బరువు పెరగకుండానే కిలో 300 నుండి 400 వరకూ తూగే వాటిని కూడా పట్టుబడి చేస్తున్నారు. దీంతో కనీసం పట్టుబడికి కూలీలకయ్యే ఖర్చులు కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

సౌకర్యాలన్నీ ఉద్యమాల ద్వారా సాధించుకున్నవే

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయులు పొందుతున్న సౌకర్యాలన్నీ ఉద్యమాల ద్వారా సాధించుకున్నవేనని, ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలతో వచ్చినవి కాదని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఆదివారం కోపల్లె జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ చరిత్ర, పోరాటాలు, నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాలను వివరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సంఘం పిలుపులను మండల శాఖ వినూత్నంగా నిర్వహిస్తూ జిల్లాలోనే ఆదర్శంగా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామభద్రం మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలు తొలగించినప్పుడు మాత్రమే పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించగలమన్నారు. రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ఉద్యమాల్లో మహిళా ప్రాతినిధ్యం మరింత పెరగాలన్నారు. ఈ సందర్భంగా మండల, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 10 అంతకుమించి ఎన్‌రోల్‌మెంట్ సాధించిన ఏడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన నాయకులను సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు పట్టాభిరామయ్య, జెవివి జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమార్‌బాబ్జి, కె.రామకృష్ణ ప్రసాద్, మండలాధ్యక్షులు బిఆర్‌ఎంకె.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌ను దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. డివిజన్, మండల స్థాయిలో నిర్వహించబోయే పిజిఆర్‌ఎస్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

సాగుపాడు - యండగండి రహదారి నిర్మించాలి

ప్రజాశక్తి - గణపవరం

సాగుపాడు, యండగండి రహదారిని వెంటనే నిర్మించాలని సిపిఎం గణపవరం మండల కార్యదర్శి పెచ్చేటి నరశింహమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాగుపాడు రహదారి పూర్తిగా దిగిపోవడంతో వాహనాలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం చేయకపోయినా కనీసం గోతులు పూడ్చక పోవడం సిగ్గు చేటని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం దారుణమని తెలిపారు. నిత్యం రద్దీగా మారి వాహనాలతో ప్రయాణాలు సాగే తాడేపల్లిగూడెం నుండి భీమవరం వెళ్లే రహదారి కొంతకాలం క్రితం సాగుపాడు నుండి పిప్పర ఎండగండి నుంచి భీమవరం వరకూ రహదారి పనులు చేపట్టినప్పటికి సాగుపాడు, యండగండి మధ్య గోతులు పూడ్చకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు మొద్దు నిద్ర వీడి రోడ్డు నిర్మాణం చేయకపోతే జరిగే ప్రమాదాలకు అధికారులే భాధ్యత వహించాలని తెలిపారు.

కార్తీక మాస ఏర్పాట్ల పరిశీలన

దేవాదాయ శాఖ రీజనల్ కమిషనర్ త్రినాధరావుచే పలు సూచనలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కార్తీక మాసం సందర్భంగా పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమాసోమేశ్వర జనార్ధనస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను దేవాదాయ శాఖ రీజనల్ కమిషనర్ (రాజమండ్రి) వేంద్ర త్రినాధరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక యాత్రికులతోపాటు సుదూర ప్రాంతాల నుండి ఆలయానికి వచ్చే యాత్రలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని ఆయన ఆలయ ఇఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు దేవాలయాల ఆలయ ఇఒలు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బీచ్‌లో పర్యాటకులు

పర్యాటకులతో బీచ్ కళకళ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ఒకపక్క చినుకులు పడుతున్నా పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు వచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకొస్తున్న కెరటాల్లో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో ఆటలాడుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

ఆనంద దీపావళి.. చేసుకుందామిలా

దీపావళి పండుగ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పలువురు డాక్టర్లు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల పట్ల జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. దీపావళి సందర్భంగా పలువురు డాక్టర్ల సూచనలు మీకోసం.

కాటన్ దుస్తులు ధరించాలి

తులసీ హాస్పటల్ డాక్టర్ బళ్ల మురళి



డాక్టర్ బళ్ల మురళి

ప్రజాశక్తి - నరసాపురం

దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తులసీ హాస్పటల్ డాక్టర్ బళ్ల మురళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పిల్లలు మారాం చేస్తున్నారని, యువకులు ఆశ పడ్డారని, కుటుంబ సభ్యుల కోరిక మేరకు టపాకాయలు కాల్చుతారు. అయితే ఏ మాత్రం ఏమరపాటుతో ఉన్నా ఇంటిల్లపాదికీ దీపావళి విషాదాన్ని మిగుల్చుతుంది. అప్రమత్తంగా ఉంటూ టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు కాల్చే ప్రదేశం బహిరంగంగా ఉండాలి. పక్కనే నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి. టపాసులు వెలగలేదని ఊదడం, నలపడం చేయకూడదు. నిప్పురవ్వలు ఎగిసిపడకుండా మిగిలిన టపాకాయలను దూరంగా ఉంచాలి. పిల్లలు, పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి. చేతుల్లో టపాసులు ఉంచుకుని కాల్చడం, విసిరేయడం చేయకూడదు. గడ్డివాములు, పాకలు, పందిళ్లకు దూరంగా టపాసులు కాల్చాలి. విద్యుత్ వైర్లు, కరెంట్ స్తంబాల పక్కన టపాసులు కాల్చకూడదు. ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారు తప్పక మాస్కులు ధరించాలి. పిల్లలు ఫేస్ షీల్డ్ ధరిస్తే మంచిది. బాణసంచా కాల్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుకుని ఆహారం తీసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

జనరల్ మెడిసిన్ డాక్టర్ మల్హోత్రా



జంగారెడ్డిగూడెం : దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ డాక్టర్ మల్హోత్ర ప్రజాశక్తితో మాట్లాడారు. టపాసులు పేల్చేటప్పుడు చిన్న పిల్లల పర్యవేక్షణ తప్పనిసరి. కాటన్ దుస్తులు వేసుకోవాలి. టపాసులు ఓపెన్ ఏరియాలోనే కాల్చాలి. టపాసులు కాల్చేటప్పుడు గాయాలైతే ముందు చల్లటి నీటితో కాలిన భాగాన్ని 10-15 నిమిషాలు కడగాలి. ఆపై ఎలాంటి ఆయిల్, టూత్‌పేస్ట్ లేదా హల్దీ వంటివి వేయకూడదు. నొప్పి తగ్గకపోతే లేదా బుడగలు వస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించాలి. పొగ, శబ్దం ఎక్కువగా ఉండే టపాసులకు దూరంగా ఉండాలి. ఆస్తమా, హార్ట్ లేదా బిపి ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. శబ్ధం, కాలుష్యం తగ్గించి పర్యావరణ హితమైన దీపావళి జరుపుకోవాలి.

చిన్న పిల్లలను టపాసులకు దూరంగా ఉంచాలి

త్రినేత్ర ఆసుపత్రి డాక్టర్ సిహెచ్.నాగేంద్రబాబు, చిన్న పిల్లల వైద్య నిపుణులు



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దీపావళి పండుగ నేపథ్యంలో చిన్నారులను టపాసులకు వీలైనంత దూరంగా ఉంచాలి. పటాకులు వెలిగించే చోట పెద్దవారి పర్యవేక్షణ తప్పనిసరి. పిల్లల చేతికి పెద్ద బాంబులు, రాకెట్లు ఇవ్వకూడదు. పిల్లలకు కాటన్ దుస్తులు వేయాలి. సింథటిక్ దుస్తులు మంటలు త్వరగా పట్టుకుంటాయి. చిన్నపాటి గాయమైనా చల్లని నీటితో ఆ ప్రదేశాన్ని కడగాలి. పేస్టులు, నూనె వంటివి రాయొద్దు. గాయం ఎక్కువైతే వెంటనే దగ్గరలోని డాక్టర్‌కు చూపించాలి. టపాసుల్లో ఉన్న కెమికల్స్ శ్వాసకోశ సమస్యలు పెంచుతాయి. అలర్జీలు ఉన్న పిల్లలను బయటకు పంపకూడదు. గది తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

డెర్మటాలజిస్ట్ డాక్టర్ కె.రామకృష్ణ



ప్రజాశక్తి - నరసాపురం

ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని డెర్మటాలజిస్ట్ డాక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయని, జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని తెలిపారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు. బాణసంచా గాయాలకు 10 నుంచి 15 నిమిషాలు చల్లని నీరు వేయాలి. యాంటీసెప్టిక్ క్రీమ్ లేదా పచ్చి గుడ్డులోని తెల్లసొనను ఒయాలి. టూత్‌పేస్టు లేదా పసుపు పూయొద్దు. కాలిన గాయాన్ని శుభ్రమైన, మెత్తటి వస్త్రం లేదా ప్లాస్టిక్ చుట్టుతో సున్నితంగా కప్పండి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లండి.

ఎరువుల ధరలను తగ్గించాలి

ఎపి రైతు సంఘం మండల మహాసభ డిమాండ్



మాట్లాడుతున్న ఆకుల హరేరాం

ప్రజాశక్తి - ఉండి

పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని ఎపి రైతుసంఘం మండల మూడో మహాసభ డిమాండ్ చేసింది. ఈ మహాసభ ఆదివారం రైతు, కార్మిక సేవా భవనంలో మండలాధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు. పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతూ ఉంటే ఎరువులకు సబ్సిడీ పెంచాల్సిందిపోయి మరికాస్త భారం రైతులపై వేయడం సరికాదన్నారు. రబీ సాగుపై అదనంగా రూ.180 కోట్లు భారం పడుతుందన్నారు. అనంతరం మండల అధ్యక్షులుగా నక్క వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా జీను ఆదినారాయణ, నేతల పాపారావు, కార్యదర్శిగా కె.తవిటినాయుడు, సహాయ కార్యదర్శిగా దేవరకొండ గిరిధర్, మరో ఏడుగురు కమిటీ సభ్యులుగా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మహాసభలో ధాన్యానికి రూ.600 సబ్సిడీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని మహాసభలో తీర్మానించారు. ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకోవాలని మరో తీర్మానం ఆమోదించారు.

రకరకాల డిజైన్లలో మట్టి ప్రమిదలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో దీపావళి సందడి మొదలైంది. మట్టి ప్రమిదలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నల్లమట్టిని తెచ్చి ప్రతిమలుగా మలిచి, ఎండబెట్టి, వాటిని మంటలో కాల్చుతారు. ప్రస్తుతం మార్కెట్లో వివిధ ఆకృతులతో, చక్కటి డిజైన్లతో తయారు చేసి విక్రయించేందుకు దుకాణదారులు ప్రమిదలను సిద్ధంగా ఉంచారు. స్వస్తిక్, ఓం, చతుర, త్రిముఖ, తులసి కోట, స్వాగత భామలు, నారికేళం తదితర రకాల ప్రమిదలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇంటి ముంగింట్లో కాంతులిచ్చే దీప ప్రమిదలు ఏర్పాటు చేసి దీపావళి రోజు సాయంకాలం వేళ వాటిని వెలిగిస్తారు. ఒక్కో ప్రమిద ధర డిజైన్ బట్టి రూ.5 నుంచి రూ.300 వరకు ఉందని వ్యాపారి రావి సత్యనారాయణ తెలిపారు.



మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు

దీపావళి సురక్షితంగా జరుపుకోవాలి

ఫైర్ ఆఫీసర్ కెవి మురళీ కొండబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దీపావళిని ప్రజలంతా సురక్షితంగా జరుపుకోవాలని ఫైర్ ఆఫీసర్ కెవి.మురళీ కొండబాబు సూచించారు. ఆదివారం స్థానిక ఎస్‌బిఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా వ్యాపారులు ప్రభుత్వ సూచనలు పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపు యజమానులకు సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేసి చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. పండుగ రోజు తల్లిదండ్రులు పిల్లలతో దగ్గరుండి బాణసంచా కాల్చించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



దీపావళి కాలుష్యంపై కరపత్రాలు పంచుతున్న కాపు వనితా క్లబ్

దీపావళి కాలుష్యంపై అవగాహన

ప్రజాశక్తి - వీరవాసరం

దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా కాల్చడం వల్ల వచ్చే కాలుష్యంపై స్థానికులకు కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. బాణసంచా కాల్చడం వల్ల కలిగే వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యంపై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి కామిశెట్టి విజయలక్ష్మి దీపావళి సందర్భంగా వదులుగా ఉండే కాటన్ దుస్తులు, కాళ్లకు చెప్పులు వేసుకుని బాణసంచా కాల్చుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ టపాసులు లేకుండా దీపాలు వెలిగించుకుని పండుగ జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ కుంచే వేణు, గుండా సత్యవతి, సత్యకుమారి, నాగమణి, మహాలక్ష్మి పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

జిఎస్‌టితో ప్రజలకు మేలు

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

జిఎస్‌టి సంస్కరణలతో పేద, మధ్య తరగతి, దిగువ తరగతి వర్గాలకు ఎంతో మేలు జరుగుతోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం మండలం పైడిపర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. జిఎస్‌టి 2.0 సంస్కరణల కారణంగా మధ్యతరగతి కుటుంబానికి ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆదా అవుతుందని తెలిపారు. ఈ విధంగా మొదటి సంవత్సరంలోనే దాదాపు రూ.8 వేల కోట్లు రాష్ట్రంలో ఆదా అవుతుందన్నారు. ప్రతి కుటుంబంలో దీపావళి పండుగ ఆనందోత్సవాల మధ్య జరుపుకునే విధంగా బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలకు జిఎస్‌టి కారణంగా ధరలు తగ్గి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గంలోని ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు పాల్గొన్నారు.

నరసాపురం: జిఎస్‌టి సంస్కరణలతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు వక్తలు తెలిపారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిఎస్‌టి 2.0, సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. జిఎస్‌టి సర్టిఫికెట్ అకౌంటెంట్ చాగంటి లవకుమార్ మాట్లాడుతూ గతంలో ఉండే జిఎస్‌టి నాలుగు శ్లాబుల రెండు శ్లాబులుగా అయ్యాయన్నారు. దీంతో టాక్స్ సులభ తరమైందన్నారు. ఎంబిఎ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌బిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కొత్త జిఎస్‌టి విధానం వల్ల దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేశ్‌కుమార్, స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, పెయింటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిఎస్‌టి సంస్కరణలతో ప్రతి కుటుంబానికి లబ్ది బాణసంచా దుకాణాలు పరిశీలించిన ఎంఎల్ఎ రాధాకృష్ణ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఏసుగుల మేడ ఎదురు సందులో ఓ అనాథ మృతి చెందడం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పృథ్వీ ఆ మృతదేహానికి ఖననం చేయాలని పాలకొల్లు అమ్మ ఛారిటబుల్ ఫౌండేషన్ సభ్యులను కోరగా ఫౌండేషన్ సభ్యులు స్పందించి మృతదేహానికి పాలకొల్లు యడ్లబజార్ శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ రమేష్, ట్రస్ట్ అధ్యక్షులు అంబటి సాయితేజ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

పెనుగొండ రూరల్: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం శివారు పేటాని వారిపాలెనికి చెందిన జక్కుల శెట్టి సతీష్ (24) ఈ నెల 19వ తేదీన తెల్లవారుజామున మోటార్ సైకిల్‌పై వెళ్లినట్లు తెలిపారు. తర్వాత ఆ మోటారు సైకిల్ దొంగరావుపాలెం బ్రిడ్జి వద్ద ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆ వ్యక్తి బ్రిడ్జి మీద నుండి గోదావరిలోకి దూకి ఉండొచ్చనే అనుమానంతో గోదావరిలో, ముట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదని తెలిపారు. అతని సోదరుడు వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాన్న స్ఫూర్తి.. కుమార్తెల ఘన కీర్తి

ఆచంట ఎంఇఒ ఇద్దరు కుమార్తెలకు ఉపాధ్యాయ కొలువులు - ఆదర్శంగా నిలిచిన చల్లపల్లి కుటుంబం



డిఎస్‌సిలో నియామకాలు పొందిన ఆచంట ఎంఇఒ కుమార్తెలు

ప్రజాశక్తి - ఆచంట

సాధారణంగా ఒక కుటుంబంలో ఒకరే ఉపాధ్యాయుడిగా ఉంటే అది గర్వకారణం. కానీ తండ్రి, ఇద్దరు కుమార్తెలు ముగ్గురూ విద్యాసేవలో తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంటే అది కేవలం అదృష్టమే కాదు, తరతరాలుగా విలువలతో నిండిన విద్యాధ్యాసతో కూడిన కుటుంబం అని చెప్పాలి. అటువంటి అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్న కుటుంబం ఆచంటకు చెందిన చల్లపల్లి నాగ సత్య శ్రీనివాస్ కుటుంబం.

తండ్రి నుంచి ప్రారంభమైన విద్యాసేవ ..

1995 సంవత్సరంలో జరిగిన డిఎస్‌సిలో అద్భుత ప్రతిభ కనబర్చి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి చల్లపల్లి నాగ సత్య శ్రీనివాస్ తన విద్యా జీవితాన్ని ప్రారంభించారు. ఆయన మొదటి నియామకం ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే జరిగింది. అప్పటి నుంచి ఆయన తన జీవితం మొత్తం విద్యార్థుల రూపకల్పనకే అంకితం చేశారు.

క్రమశిక్షణ, విద్యపట్ల ఆయనకున్న ప్రేమ ఆయనను క్రమంగా ప్రధానోపాధ్యాయుడిగా, ఆపై ఆచంట మండల విద్యాశాఖాధికారిగా (ఎంఇఒ-1)గా తీర్చిదిద్దాయి. గురువు తన కర్తవ్యాన్ని నిజాయతీగా నిర్వర్తిస్తే ఒక తరం మారుతుందన్నది చల్లపల్లి నాగ సత్య శ్రీనివాస్ తపన.

తండ్రి మార్గంలో కుమార్తెలు..

తండ్రి చూపిన మార్గం కుమార్తెలకు మార్గదర్శకంగా మారింది. పెద్ద కుమార్తె చల్లపల్లి నాగ సాయి లక్ష్మీ శ్రావణి విద్య పూర్తి చేసిన తరువాత తాజాగా డిఎస్‌సిలో ప్రతిభ కనబర్చి, పాలకొల్లు బ్రాడీపేటలోని ఎఎస్ఎన్ఎం స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా నియమితులయ్యారు.

ఆమె తన తండ్రి ఆచరణాత్మక విలువలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సిద్ధమవుతోంది.

చిన్న కుమార్తె చల్లపల్లి నాగ సాయి శ్రీలత కూడా విద్యాసేవ పట్ల అపారమైన ఆసక్తితో ముందుకొచ్చారు. ఇటీవల జరిగిన డిఎస్‌సిలో జిల్లాలో రెండవ ర్యాంక్ సాధించి ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంటే తన తండ్రి మొదటి నియామకం పొందిన అదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరి సేవలందించేందుకు సిద్ధమయ్యారు. ఇది కేవలం ఒక నియామకం కాదు, తండ్రి ఆరంభించిన విద్యాసేవలో కూతురు అడుగుపెట్టిన స్ఫూర్తిదాయక ఘట్టం.

ఒకే పాఠశాలలో తండ్రీ కూతురు బోధన అరుదైన చరిత్ర. ఆచంట హైస్కూల్ ప్రాంగణం ప్రస్తుతం ఒక అద్భుతమైన అనుభూతికి సాక్ష్యం. అదే తరగతుల్లో ఒకప్పుడు తండ్రి బోధించిన గదుల్లో నేడు ఆయన కుమార్తె కూడా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడం అరుదైన ఘట్టం.

తమ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయన కుమార్తె ఇద్దరూ బోధిస్తున్నారు. మాకు అదే పెద్ద స్ఫూర్తి. అని విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం ఒక సంఘటన కాదు, విద్యాసేవలో వారసత్వం ఎలా కొనసాగుతుందో చూపించే సజీవ సాక్ష్యం.

తండ్రి చూపిన విలువలు, క్రమశిక్షణ, సేవాభావం ఇవే మా విజయానికి బాటలు వేశాయని లక్ష్మీ శ్రావణి, శ్రీలత తెలిపారు. విద్య అనే సుదీర్ఘ యాత్రలో తండ్రి బాటలో కూతుళ్లు నడుస్తున్న ఈ కుటుంబం ఆచంట ప్రజలకు గర్వకారణమని, మండలంలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అపుస్మా సభ్యులు విద్యారత్న కుటుంబానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

దీపావళి దుకాణాలు వెలవెల



ఆచంటలో వెలవెలబోతున్న దుకాణాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో బాణా సంచా దుకాణాలు వెలగలబోతున్నాయి. దీపావళి ముందు రోజు ఆదివారం కొనుగోలుదారుల కోసం దుకాణదారులు నిరీక్షిస్తూ కనిపిస్తున్నారు. రోజు రోజుకి పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరల, వ్యవసాయం ఆశాజనకంగా లేకపోవడం బాణాసంచా ధరలు కూడా భారీగా పెరగడమే కారణంగా చెప్పవచ్చు. దీనికి తోడు వాతావరణంలో మార్పులు కూడా వ్యాపారులను మరింత కలవర పెడుతుంది. గత రెండు రోజుల నుంచి ఆచంట మండలంలో ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరహాలో బాణాసంచా దుకాణాలకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని అమ్మకాలు లేకపోవడంతో ఏమి చేయాలో పాలు పోవడం లేదని ఆచంట గ్రామానికి చెందిన బాణాసంచా వ్యాపారులు బండి సూర్యనారాయణ ప్రజాశక్తి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రక్క గత రెండు రోజుల నుంచి అల్పపీడన ప్రభావంతో వాతావరణం మేఘావతమై వర్షం కురుస్తుండడంతో బాణాసం చా విక్రయదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి ఆకాశం మెగాకతమై చిరుజల్లు కురుస్తూనే ఉన్నాయని బాణాసంచా అమ్మకదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, కరుగోరిమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, తదితర గ్రామాల్లో సుమారు 20కు పైగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల్లో మందు గుండు సామాగ్రిపై ప్లాస్టిక్ సంచుల కవర్లో కప్పి వాటిని కాపాడుకోవడానికి నానా తంతాలు పడుతున్నారు. సోమవారం దీపావళి కావడంతో తెచ్చిన సామాగ్రి అమ్ముడు అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. మారిన వాతావరణం గత ఏడాది కంటే ఈ ఏడాది బాణాసంచా ధరలు విపరీతంగా పెరగడంతో అమ్మకాలు జరుగుతాయా లేదా అని వ్యాపారస్తులు మదన పడుతున్నారు.

మొగల్తూరు: బాణసంచా అమ్మకాలపై వర్షం తీవ్ర ప్రభావం చూపింది. మొగల్తూరులో పది, ముత్యాలపల్లి, కాళీపట్నం, కెపి.పాలెం, పేరుపాలెం గ్రామాల్లో పలువురు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. నిర్ణీత స్థలాల్లో పందిర్లు వేశారు. వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచి, బురదతో నిండాయి. దీంతో వ్యాపారులు అక్కడ విక్రయాలు ఎలా సాగించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేసి తీసుకొచ్చిన బాణసంచా అమ్మకాలు సాగుతాయా, లేదా అనే ఆందోళన వారిలో నెలకొంది. దీపావళి రోజైనా వర్షం తెరిపిస్తే పెట్టుబడులైనా దక్కించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.



ఆకివీడులో..

పాలకొల్లు: పెరుగుతున్న అధిక ధరలు, ఖర్చులతో పేద, మధ్యతరగతి ప్రజలు దీపావళి కాంతులకు దూరమవుతున్నారు. బాణసంచా కాల్చేందుకు సైతం విముఖత చూపడం గమనార్హం. పాలకొల్లుతోపాటు పలు పట్టణాల్లో గతంలో ఉండే షాపులే ప్రస్తుతం ఉన్నాయి.

పిండి వంటలూ కొనుగోలే..!

ఆధునిక కాలంలో ఇళ్ల వద్ద పిండి వంటలు చేయడం బాగా తగ్గింది. అందరు మిఠాయి దుకాణాలకు వెళ్లడం అలవాటైంది. నిత్యావసరాల ధరలు ఎక్కువగా ఉండటంతో పిండి వంటలు చేసుకోవడానికి జనం విముఖత చూపుతున్నారు. పండుగ రోజు చేతిలో సొమ్ముంటే మిఠాయి దుకాణానికి వెళ్లి పావు కేజీనో, అర కేజీనో స్వీట్లు కొనుగోలు చేసుకుని పండుగ చేసుకుంటున్నారు.

ఆకాశాన్నంటిన బాణసంచా ధరలు

వంద రూపాయలు పెడితే చిన్న పిల్లలకు కొద్దిపాటి మందుగుండు సామగ్రి వచ్చేది. ప్రస్తుతం రూ.వెయ్యి పెడితే సామాన్య కుటుంబానికి అవసరమైన బాణ సంచా మాత్రమే వస్తోంది. మధ్యతరగతి ప్రజలు కనీసం రూ.ఐదు వేలు పెడితేగాని వారికి కావాల్సిన సామగ్రి అందని పరిస్థితి.



పాలకొల్లులో..



గణపవరంలో..

గణపవరం: వర్షాల నడుమ కొనుగోలుదారులు లేక బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. గణపవరం శివారు గాంధీనగర్ వద్ద వ్యాపారులు ఆరు షాపులు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో బాణసంచా వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, ఆకాశంలో మబ్బుల వల్ల తమ వ్యాపారం దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. షాపులు ఏర్పాటు చేసిన స్థలం వర్షానికి బురదతో నిండటంతో జనం రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సోమవారం ఎండ కాస్తే వ్యాపారం సాగే అవకాశం ఉందని, లేకపోతే తీవ్రంగా నష్టపోతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆకివీడు : దీపావళి బాణసంచా దుకాణాలు ఈ సంవత్సరం భారీగా తగ్గాయి. ప్రతి సంవత్సరమూ స్థానిక సిబీసీఎంసీ హై స్కూల్ గ్రౌండ్‌లో అధికారులు నిర్ణయించిన ప్రాంతంలో సుమారు 25 వరకూ దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఈ సంవత్సరం 16 దుకాణాలు మాత్రమే ఏర్పాటు చేశారు. మొత్తం మండలంలో ఉన్న లైసెన్స్‌ల సంఖ్య కూడా తగ్గింది. అయితే మూడు రోజుల నుండి వాతావరణ మొత్తం మేఘావతమై వాన కురుస్తూ ఉండడంతో ఆ ప్రాంగణం మొత్తం బురదమయంగా మారింది. అందులోనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే అంతా బురదగా ఉండడంతో నడిచే పరిస్థితి లేక వినియోగదారులు వెనుకంజ వేస్తున్నారు. మరో పక్క చినుకులు పడుతూ ఉండడంతో బాణసంచా తడిసిపోయి కాలుతాయో కాలవో అనే సందేహంతో కూడా కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రత్యేకంగా మూడు రోజులకే లైసెన్స్, ఇతర ఖర్చులు వెచ్చించి ఏర్పాటు చేసిన దుకాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద వాతావరణం అటు వ్యాపారుని, ఇటు వినియోగదారుని సైతం తీవ్రమైన నష్టాల్లోకి తోసిందని చెప్పాలి.




మొగల్తూరులో..

విద్యా వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఏపి ప్రయివేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తణుకు గమిని ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం కార్యక్రమం అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎంఎస్ఆర్.ఆంజనేయులు (ప్రగతి రాజా) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య కీలక దశ అని, ఈ సమయంలో విద్యార్థుల పట్ల అధ్యాపకులు శ్రద్ధ తీసుకోవడం ద్వారానే ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా విద్యా వ్యవస్థ ఇబ్బందులు పాలైందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. స్కూలు విద్య నుంచి కళాశాల విద్య వరకూ నాణ్యమైన విద్య అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా తీర్చేదిద్దే విధంగా ప్రయివేటు కళాశాలకు చెందిన యాజమాన్యాలు విశేష కృషి చేస్తున్నాయని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో వివిధ ప్రయివేటు కళాశాలలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉన్న అధ్యాపకులను ఎంఎల్ఎ రాధాకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఐఇఒ గొల్ల ప్రభాకర్, అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వ్యవస్థాపకులు లక్కినేని ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకట ప్రసాద్, అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వరరావు, జి.సాంబశివరావు, డి.ప్రభాకర్, ఎస్‌సి.శేఖర్‌రావు, వై.శివ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ఆరిమిల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాళ్ల

యుటిఎఫ్ కాళ్ల మండల శాఖ అధ్యక్షుడిగా బిఆర్ఎంకె స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, ఎన్నికల పరిశీలకులు జి.రామకృష్ణంరాజు తెలిపారు. కోపల్లె హై స్కూల్లో మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా విఆర్‌కె.రవికుమార్ రాజు, అధ్యక్షులుగా బిఆర్ఎంకె.స్వామి, సహ అధ్యక్షులుగా పి.ప్రభుదాసు, మహిళా సహాధ్యక్షులుగా డి.కనకదుర్గ, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు, కోశాధికారిగా బి.కిషోర్, కార్యదర్శులుగా ఎస్‌వి.అప్పలనాయుడు, కె. రామ్మూర్తి రాజు, టి.బాల బాలాజీ, పిఎస్ విష్ణుప్రసాద్, ఎన్‌డివి ప్రసాద్, పి.విజయకుమార్, కెడివి.ప్రసాద్, వి.రమేష్, పివిఎల్ గ్లోరీ, బి.అనురాధ, జిల్లా కౌన్సిలర్లుగా బిఆర్ఎంకె.స్వామి, ఎం.శంకర్రావు, ఎవి.సుబ్బరాజు, పి.ఆరోగ్యం, కె.రవిచంద్ర కుమార్, జివి.మురళీధర్, ఎం. తిరుమలరావు, డి.ప్రసన్న భారతి, బిబి.మణి ఎన్నికయ్యారు.



బిఆర్ఎంకె.స్వామి



ఎం.శంకర్రావు

నెల్లూరు ఘటనకు కుల రంగు పూయడం తగదు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

నెల్లూరు ఘటనకు కుల రంగు పులిమి వైసిపి విష ప్రచారం చేయడం ఆ పార్టీ రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్ట అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నెల్లూరు ఘటనకు కుల రంగు పులిమి, అక్కడి శవ రాజకీయాలు సృష్టించి ఆ మంటల్లో చలికాచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఇద్దరు వ్యక్తిగత గొడవలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 సామాజిక తరగతులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. కాపులకు రాజకీయ అధికారంలో అత్యధిక భాగస్వామ్యం కల్పించిన పార్టీ టిడిపి అన్న సంగతి గణాంకాలు తీస్తే వాస్తవాలు వెల్లడవుతాయని మంత్రి చెప్పారు. విష ప్రచారాలు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాంలో భాగంగా వ్యక్తిత్వ వికాస ఉపన్యాసాలు, కెరియర్ గైడెన్స్‌పై వివరించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, భారతీయ సంస్కృతి వాఙ్మయం కోరుకుంటాయని, జీవిత బీమా విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు గరికపాటి బాపయ్య శర్మ వివరించారు. ఈ సందర్భంగా స్థానిక కొబ్బరి తోట ఇవిఎం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు చదువు సాధన, విజ్ఞానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, గ్రంథాల సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పెంచిన పనిగంటలు తగ్గించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పనిగంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వద్ద సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ 1886 బ్రిటీష్ గవర్నమెంట్ కాలంలో 8 గంటల పని దినం కోసం ఎంతోమంది కార్మికుల బలిదానంతో ఏర్పడిన ఈ హక్కులను అలాగే అనేక రాయితీలను కూటమీ ప్రభుత్వం మొన్న జరిగిన శాసనసభ సమావేశాలలో యజమానులుకు అనుకూలంగా ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలు పనిచేయాలని చట్టం చేయడం దురదృష్టకరమని తెలిపారు. అలాగే పగటిపూట మహిళలకు రక్షణ లేని ఈ వ్యవస్థలో రాత్రిపూట కూడా మహిళలను పని చేయించుకోవచ్చని చట్టం చేయడం మహిళ లోకాన్ని అవమానపరిచినట్టుగా ఉందని వారు తెలిపారు అలాగే గత 20 సంవత్సరాల నుండి కార్మికులకు కనీస వేతనాలు జిఒ ఈ రోజుకు కూడా అమలు చేయలేదని, కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను కూడా యజమానులకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విధించి కార్మికులను కట్టు బానిసలుగా చేసే విధానాన్ని కూటమి ప్రభుత్వం చట్టం చేయడం చాలా దుర్మార్గమని తెలిపారు. ఈ విధానాలను వ్యతిరేకించడం కోసం ఈనెల 28, 29వ తేదీల్లో జిల్లా మహాసభ జరుగుతుందని ఆ జిల్లా మహాసభలోని ఈ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం దాంట్లో తీర్మానాలు రూపొందించి ప్రజాక్షేత్రం లో ప్రభుత్వాలను ఎండగట్టడానికి తగు కార్యాచరణ రూపొందిస్తారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, నారాయణ అడపా ఆంజనేయులు, గాది వెంకటరావు, ఎస్‌విఎస్.రెడ్డి, కృష్ణ బుద్దాల నాని పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు. పెనుగొండ మండలం దొంగరావి పాలెం బ్రిడ్జి వద్ద గోదావరి నదిలో సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గల ఓ మహిళ మృతదేహం ఉందని తెలిపారు. విఆర్ఒ గాదంశెట్టి నాగేశ్వరి ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పుష్కరాల రేవు శుభ్రం కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

సిద్ధాంతంలో వశిష్ట గోదావరి వద్ద పుష్కరాల రేవు అధ్వాన్నంగా ఉండటంపై ఆదివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల్లో కార్తీక మాసం ప్రారంభమవుతోందని, అయితే కనీసం రేవులోకి దిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ దేవి నవరాత్రుల సందర్భంగా పెట్టిన దుర్గమ్మ విగ్రహాలు ఇక్కడ నిమజ్జనం చేశారని, విగ్రహాలు ఎక్కడివి అక్కడే మెట్లపై ఉండడంతో రేవులోకి దిగే పరిస్థితి లేదని తెలిపారు. ఇక్కడ రేవులో ఒండ్రు మట్టి, బొమ్మలు తొలగించాలని కోరారు.



సిద్ధాంతం పుష్కరాల రేవు మెట్లపై విగ్రహాలు